క్లుప్తంగా...

బీజేపీలోకి శాంసన్‌రాజు దంపతులు



శాంసన్‌రాజు, పద్మ దంపతులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. కాంగ్రెస్ పార్టీ కంటోన్మెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి శాంసన్‌రాజు, పద్మ దంపతులు బుధవారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. రసూల్‌పురా అవంతి కాలనీలో తన కార్యాలయంలో శాంసన్‌రాజు మాట్లాడుతూ.. వచ్చే బోర్డు ఎన్నికల్లో రెండో వార్డు నుంచి బీజేపీ మద్దతుతో పోటీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శ్రీను, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలించిన ఇన్‌చార్జి ఏసీపీ

బౌద్ధనగర్: బౌద్ధనగర్ కమ్యూనిటీ హాలులో త్వరలో నూతనంగా ప్రారంభం కానున్న ఏసీపీ కార్యాలయాన్ని చిలకలగూడ ఇంచార్జ్ ఏసీపీ శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కంది నారాయణ, రాజేష్ పాల్గొన్నారు.

బోర్డు ఎన్నికల్లో పోటీచేయనున్న వినీత



తిరుమలగిరి పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న వినీత

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో ఏడో వార్డు తిరుమలగిరి నుంచి పోటీచేస్తున్నట్లు బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు కమిటీ మాజీ సభ్యురాలు వినీత బుధవారం ప్రకటించారు. రాజకీయ, ఉద్యమకారుల కుటుంబం నేపథ్యం ఉన్న ఈమె బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీలో ఉంటున్నట్లు పేర్కొన్నారు. తన తాత నాలుగు పర్యాయాలు బోర్డు సభ్యుడిగా కొనసాగారన్నారు.తన తల్లి దండ్రులు గౌరీశ్వరి, జయశీలన్‌లు తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారన్నారు.

10న బోర్డు కార్యాలయాన్ని ముట్టడిస్తాం



కార్యక్రమంలో పాల్గొన్న క్రిశాంక్

రసూల్‌పురా: ఓటు హక్కు తొలగించిన వారందరికీ ఓటుహక్కు పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న కంటోన్మెంట్ బోర్డు కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నే క్రిశాంక్ తెలిపారు. బోర్డు ఆరవవార్డులో బోర్డు ముట్టడి కార్యక్రమంపై బుధవారం రాత్రి ప్రచారం చేశారు. బోర్డు పరిధిలో మొత్తం 35 వేల మంది ఓట్లను తొలగించారన్నారు.

భిన్నరంగాల్లో రాణిస్తున్న మహిళలు

చిక్కడపల్లి: రెండు, మూడు దశాబ్దాల క్రితం ఇంటికే పరిమితమైన మహిళలు నేడు భిన్న రంగాలలో రాణిస్తున్నారని మహిళా ప్రముఖులు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం త్యాగరాయగానసభలోని కళాదీక్షితులు కళావేదికపై సాహితీ జిగీష మహిళా సాహితీ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సమాజ సేవకురాలు కమలాకర భారతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్త్రీ శక్తిని తక్కువ అంచనా వేసేవారు నేటికీ సమాజంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వయం శక్తితో ఎందరో స్త్రీలు ఉన్నత స్థానానికి ఎదిగారని, మనదేశం మహిళల పురోగతికి అవకాశాలు కల్పిస్తోందన్నారు. పులిగడ్డ విజయలక్ష్మి ఈ సభకు అధ్యక్షత వహించారు.

- సాహితి రంగంలో భారతి, సంగీత రంగంలో దివ్య, నాట్యరంగంలో స్రవంతి వైద్య రంగంలో పద్మావతి, సాహితి రంగంలో నాగరత్న, పత్రికా రంగంలో పురస్కారాలను అందుకున్నారు. లలితా పరమేశ్వరి, ఉమాశ్రీ, జ్యోతి రుద్రమదేవి, లలిత వాణి, లీలావాణిలు చేపట్టిన పలు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



సందడిగా మహిళా దినోత్సవం

పలుచోట్ల వేడుకలు

రసూల్‌పురా: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వివిధ పార్టీల నేతల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు జరిగాయి. బొల్లారం చింతల్ బజార్, పయనీర్ బజార్, రిసాల బజార్‌ల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జైప్రకాష్ ఆధ్వర్యంలో మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు.

- మూడవ వార్డు బాలంరాయి 40 క్వార్టర్స్, బాలంరాయి అంబేడ్కర్ సొసైటీలో బీఆర్ఎస్ నాయకులు టి. రాజుసింగ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వృద్ధురాలితో కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా 60 ఏళ్ళపై బడిన మహిళలను ఘనంగా సన్మానించారు.
- మూడో వార్డు అంబేడ్కర్ నగర్, మడ్‌ఫోర్ట్, కార్ఖాన, కట్టకింది బస్తీల్లో బీజేపీ మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేశారు. వివిధ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ సామల హేమ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం, మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేయడంతో పాటు మహిళలను శాలువాలతో సత్కరించారు.



డిప్యూటీ మేయర్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నేతలు

బౌద్ధనగర్: మహిళలు అన్ని రంగాల్లో రాణించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తుందని కార్పొరేటర్ కంది శైలజ పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం అంబర్‌నగర్ కమ్యూనిటీహాలులో వేడుకలు నిర్వహించారు.

రైల్వే హాస్పిటల్‌లో..

అడ్డగుట్ట: నేడు మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని లాలాగూడ కేంద్రీయ రైల్వే హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ సురేందర్ నాయక్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం లాలాగూడ రైల్వే హాస్పిటల్‌లో అడిషనల్ చీఫ్ హెల్త్ డైరెక్టర్ పద్మ నేతృత్వంలో వేడుకలు నిర్వహించారు. మెడికల్ డైరెక్టర్ సురేందర్ నాయక్ మాట్లాడుతూ.. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని అన్ని రంగాల్లో మహిళలు సత్తా చాటుతున్నారని పేర్కొన్నారు. చీఫ్ స్టాఫ్ సర్జన్ ఎస్.ఎన్. ప్రసాద్, వైద్యులు పూజా, కృష్ణవేణి పాల్గొన్నారు.

లాలాపేట: తార్నాకలోని డిప్యూటీ మేయర్ కార్యాలయంలో వద్ద జరిగిన వేడుకల్లో బీఆర్ఎస్ కార్మిక విభాగం ఆధ్వర్యంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డితో పాటు పలువురు మహిళలను శాలువాతో సత్కరించారు.

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు గదరాజు చందు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సంజయ్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, ఉద్యోగులను సన్మానించి, పుష్పగుచ్ఛాలని అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.



ఆశా వర్కర్లను సన్మానిస్తున్న సనత్‌నగర్ కార్పొరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి



సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాలలో..





బౌద్ధనగర్‌లో కార్పొరేటర్ కంది శైలజ తదితరులు



సీతాఫల్‌మండి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ సామల హేమ



తార్నాకలో పారిశుద్య కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం





మూడో వార్డులో జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న దశ్యం



మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్న బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జై ప్రకాష్



జెక్ కాలనీలోని విజయ గ్రాండియర్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ లక్ష్మీబాల్ రెడ్డి, అన్నపూర్ణ, హైమావతి, హరిత,విమల, సుందరి, గీత,ప్రభ వాణి,శైలజ తదితరులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అడ్డగుట్ట: కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన మేరకు.. అడ్డగుట్ట బి సెక్షన్‌కు చెందిన మల్లేష్(51) జీహెచ్ఎంసీ స్వీపర్‌గా పని మద్యానికి బానిసైన అతను ఈ నెల 4న మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికొచ్చాడు. అనంతరం భార్యతో గొడవపడి ఆవేశంతో గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్న మల్లేష్ క్షణికావేశంలో ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. గదిలో నుంచి అరుపులు కేకలు వినబడటంతో తలుపులు బద్దలుగొట్టి మల్లేష్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించారు. కాగా, చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు.

రేషన్ బియ్యం నిల్వ చేసి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

అంబర్‌పేట: గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా రేషన్ బియ్యం కొనుగోలు చేస్తూ.. విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన బుధవారం అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటేల్‌నగర్‌కు చెందిన సయ్యద్ తమీమ్ (21), ఎండీ మజర్ (28) స్థానికుల నుంచి కిలో రూ.7 చొప్పున బియ్యాన్ని కొనుగోలు చేసి రూ.11కు విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో 22.40 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు విచారణ నిమిత్తం అంబర్‌పేట పోలీసులకు అప్పగించగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెట్రో రైల్ బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం

సికింద్రాబాద్: కుటుంబ కలహాల కారణంగా ఓ యువకుడు బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. చత్తీస్‌ఘడ్‌లోని రాయపూర్‌కు చెందిన పవన్(25) ఇంట్లో తల్లితో గొడవపడి మూడు రోజుల క్రితం సికింద్రాబాద్‌కు వచ్చాడు. బుధవారం బోయిగూడ సాయిబాబా ఆలయం సమీపంలోని మెట్రో రైల్ బ్రిడ్జ్ ఎక్కి దానిపై నుంచి దూకి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో కరెంట్ వైర్లపై పడడంతో గాయాలపాలయ్యాడు. దీంతో వెంటనే సదరు యువకుడ్ని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ఓయూకు సింగరేణి కాలరీస్ రూ.1.2 కోట్ల విరాళం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో తరగతి గదుల నిర్మాణానికి సింగరేణి కాలరీస్ లిమిటెడ్ నిర్వాహకులు కార్పొరేట్ సోషల్‌రెస్పాన్స్‌లో (సీఎస్ఆర్) రూ.1.2 కోట్ల విరాళాన్ని అందచేసింది. ఈ నిధులతో బుధవారం వర్సిటీలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో చేపట్టనున్న తరగతి గదుల భవన నిర్మాణానికి సింగరేణి కాలరీస్ సీఎండీ శ్రీధర్, వీసీ ప్రొ.రవిందర్, ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్, వైస్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్ తదితరులు శంకుస్థాపన చేసి మాట్లాడారు.



ప్రతి ఒక్కరూ మహిళా శ్రేయస్సు కోరుకోవాలి

వెంగళరావునగర్: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు సురేందర్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం వెంకటగిరిలో ప్రత్యేకంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి మహిళల శ్రేయస్సును కోరుతూ, అనురాగారంతో చూసుకుంటే ప్రతి ఇల్లు స్వర్గం అవుతుందన్నారు. మెడికల్ క్యాంపులో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సురేందర్ యాదవ్, శ్రీశైలం యాదవ్, అఫ్జల్‌ఖాన్, మహేందర్ యాదవ్, రవి యాదవ్, సతీష్‌దాస్, నానిగౌడ్, వేణు, వెంకట్‌రెడ్డి, సత్తయ్య, శంకర్, అనిల్ జావిద్ తదితరులు పాల్గొన్నారు. కాగా డాక్టర్లు తిరునగరి శ్రీకర్, రాజ్‌కుమార్, లక్ష్మీ నారాయణ క్లినిక్, యోధా డయాగ్నస్టిక్ సిబ్బంది వైద్య సేవలందించారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే విష్ణు

మహిళా పోలీసులకు సన్మానం

అమీర్‌పేట: ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం ఎర్రగడ్డ శాంతి సంఘం వ్యవస్థాపకులు గంట మల్లేష్ ఆధ్వర్యంలో సనత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసే మహిళా పోలీసులను సన్మానించారు.కార్యక్రమంలో సనత్‌నగర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ముత్తు యాదవ్ పాల్గొన్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి: సీఐటీయూ

వెంగళరావునగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, మహిళా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ఎండగట్టాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు కుమార్, శ్రామిక మహిళా కన్వీనర్ వాణి అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని ఎర్రగడ్డ ప్రభుత్వ చాతీ ఆసుపత్రిలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్లమెంట్‌లో 33 శాతం రిజర్వేషన్ బిల్లు పెట్టి 20 ఏళ్లైనప్పటికీ దానిని ఇంతవరకు ఆమోదించకపోవడం శోచనీయమన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో సైతం మహిళలకు రక్షణ కరువైందని, ఇప్పటికైనా మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాపర్తి అశోక్, ఎస్.శ్రీనివాస్, రిజ్వానా, పద్మ, అమృత, అనిత, కృష్ణ, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ



ప్రభుత్వ పాఠశాలకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ బృందం

అడ్డగుట్ట: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తమవంతు సహాయ సహకారాలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ జననీ పేర్కొన్నారు. ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం యూనియన్ బ్యాంక్ సిబ్బంది క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏసీఎస్ నగర్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం ప్లేట్లు, ఫ్యాన్స్, మైక్‌సెట్‌తో పాటు వాలీ బాల్, టెన్నిస్ బాల్స్, క్యారమ్ బోర్డ్, షటిల్ కాక్స్, రింగ్ అందజేసినట్లు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ పద్మావతి, అనిత, పావని పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో మహిళా బిల్లు పెట్టాలి

కాచిగూడ: పార్లమెంట్‌లో మహిళా బిల్లు పెట్టి అమోదించాలని బీసీ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం బీసీ మహాసభ ఆధ్వర్యంలో మహిళా బిల్లుపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి కాచిగూడలో నిరసన ర్యాలీ నిర్వహించారు. దేశంలోని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు మహిళా బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరారు. మహిళా బిల్లును వ్యతిరేకించే పార్టీలకు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. తుంగబాబు, ధరణీదర్ యాదవ్, జనార్దన్, నాగయ్యయాదవ్, బాలయ్య, అలీం, పులిజాల కృష్ణ పాల్గొన్నారు.

దళిత హక్కుల పోరాట సమితి మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

కాచిగూడ: దళిత హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభ వాల్ పోస్టర్‌ను హిమాయత్‌నగర్‌లోని ముఖ్దుమ్‌భవన్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రతి రోజూ దళితులపై దాడులు, మారణహోమాలు జరుగుతూనే ఉన్నాయని ఆరోపించారు. కులం ఆధారంగా ద్వేషపూరిత నేరాల ఘటనలను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం, నర్సయ్య, బాలనర్సింహ, బాలమల్లేష్, అనిల్‌కుమార్, లక్ష్మణ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆశ్రమ చిన్నారుల హోలీ సంబరాలు



లాలాపేట: వివిధ సాఫ్ట్‌వేర్ రంగంలో పని చేస్తున్న కొందరు యువతీ, యువకులు లవ్ లాయాల్టీ సర్వీసు పేరుతో ఓ టీంగా ఏర్పడ్డారు. దీని ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం హోలీ వేడులను నిర్వహించారు. లాలాపేటలోని రెయిన్‌బో ఆశ్రమ చిన్నారులను ప్రొ.జయశంకర్ స్టేడియానికి తీసుకువచ్చి వారితో కలిసి హోలీ సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆ చిన్నారులకు భోజనం ఏర్పాటు చేశారు.

వీధికుక్కల సమస్యపై అవగాహన కల్పిస్తున్నాం

- ప్రజలు కుక్క కాటుకు గురికాకుండా గట్టి చర్యలు
- ఫిర్యాదులపై సకాలంలో స్పందిస్తున్నాము
- సాక్షితో జీహెచ్ఎంసీ వెటర్నరీ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ సద్గుణాదేవీ



బన్సీలాల్‌పేట్: ప్రజలు కుక్కకాటుకు గురికాకుండా నిర్మాణాత్మకమైన కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని.. పెద్ద ఎత్తున కుక్కలను పట్టుకొని ఆపరేషన్, వ్యాక్సినేషన్ చేస్తున్నామని జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోన్ వెటర్నరీ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ సద్గుణాదేవీ చెప్పారు. కుక్కల బెడద నుంచి ప్రజలు ఏ విధంగా తమను తాను కాపాడుకోవాలనే విషయంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులతోపాటు బస్తీలు, కాలనీల్లో మహిళలను చైతన్యవంతులను చేస్తూ కరపత్రాలను అందజేస్తున్నామని సాక్షి ముఖాముఖిలో పలు విషయాలను వెల్లడించారు.

- **కుక్కల నుంచి ప్రజలకు రక్షణ కల్పించడానికి తీసుకుంటున్న జాగ్రత్తలు..**

కుక్కల వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా నిర్మాణాత్మకమైన కార్యాచరణతో ముందుకు సాగుతున్నాం. కుక్కల సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సిబ్బంది వాటిని పట్టుకొని కూకట్‌పల్లికి తరలిస్తున్నాము. వాటికి సంతానం కలుగకుండా ఆపరేషన్లతో పాటు వ్యాక్సిన్లు వేయిస్తున్నాము. కుక్కల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాము. విద్యా సంస్థలు, కమ్యూనిటీహాళ్లు, బస్తీల్లో ప్రజలను చైతన్యవంతులను చేస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తున్నాము.

- **కుక్కలను పట్టుకోవడానికి తీసుకుంటున్న చర్యలు**

జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోన్ పరిధిలో కుక్కలను పట్టుకోడానికి 5 వాహనాలు ఉన్నాయి. ప్రతి వాహనంలో ఆరుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే సిబ్బంది అక్కడి వెళ్లి కుక్కలను పట్టుకుంటారు. ప్రతి రోజూ సుమారు 100 ఫిర్యాదులు వస్తున్నాయి. ముఖ్యంగా ఫోన్ కాల్స్, ఆన్‌లైన్, ట్విట్టర్ ద్వారా ఎక్కువగా ఫిర్యాదు వస్తున్నాయి. వీటిపై సకాలంలో స్పందిస్తున్నాము.

- **రోడ్లు, మార్కెట్లలో పశువుల సంచారం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వీటిపై మీ యాక్షన్ ప్లాన్..**

మార్కెట్లు, రోడ్లపై పశువుల సంచారం గురించి మాకు అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. అయితే వీటిపై సదరు యజమానులకు పలు సూచనలు చేస్తున్నాము. ఇప్పటికే సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లోని పశువుల యజమానులతో ఓ సమావేశాన్ని కూడా నిర్వహించాము. పశువులు రోడ్లు, మార్కెట్లతో సంచరిస్తూ ప్రజలను గాయపర్చకుండా వాటిని బహిరంగ ప్రదేశాల్లో వదిలేయరాదంటూ సూచనలు చేశాం. అలాగే నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చలాన్లు వేస్తున్నాము.

- **చిన్నారులు, ప్రజలు కుక్కకాటుకు గురికాకుండా మీరిచ్చే సూచనలు, సలహాలు**

కుక్కలు ఆహారం తింటున్న, నిద్రిస్తున్న సమయంలో తల్లికుక్కలు తమ పిల్లలకు పాలు ఇస్తున్నప్పుడు వాటి వద్దకు వెళ్లరాదు. కుక్కలపై రాళ్లు విసరరాదు. కుక్క పిల్లల దగ్గరకు చిన్న పిల్లలు వెళ్లకుండా చూడాలి. కుక్కలు దగ్గరగా ఉన్నప్పుడు వేగంగా నడవరాదు...అలా చేస్తే అవి మీ వెంటపడుతాయి. కుక్కల కళ్లలోకి సూటిగా చూడరాదు. కుక్క అరుస్తూ మీ దగ్గరకు వచ్చినప్పుడు మీరు కదలకుండా చెట్టులా నిలబడాలి. వాసన చూసిన కుక్క సాధారణంగా మనిషిని కరవకుండా వెళ్లిపోతుంది.

ఎవరికి ఫిర్యాదు చేయాలంటే..

అసిస్టెంట్ డైరెక్టర్: జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోన్ పరిధిలో అయిదు సర్కిళ్లకు కుక్కలు పట్టుకోడానికి అయిదు వాహనాలు ఉన్నాయి. తమ సిబ్బంది క్షేత్ర స్థాయిలో నిత్యం సంచరిస్తుంటారు. ఆయా సర్కిళ్ల పరిధిలో వెటర్నరీ ఆఫీసర్లు పనిచేస్తున్నారు. ప్రజలు ఫోన్ ద్వారాగానీ ఆఫీసర్లకు ఫిర్యాదు ఇవ్వడానికి వీలుంది. డాక్టర్ సరిత– 91541 56670(సికింద్రాబాద్–బేగంపేట్ సర్కిళ్ల పరిధిలోని వెటర్నరీ అధికారి) డాక్టర్ వనజకుమారి – 91543 69424 (మల్కాజిగిరి సర్కిల్), డాక్టర్ బికియా నాయక్ – 91542 99721 (అంబర్‌పేట్, ముషీరాబాద్ సర్కిల్).

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379